క్లుప్తంగా

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



కాకుమాను: మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త బలసాని కిరణ్ కుమార్ పరామర్శించారు. ఆదివారం మండల కేంద్రం కాకుమానుకు చెందిన పార్టీ కార్యకర్త గుంటి రవి అనారోగ్య కారణంతో ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న బలసాని మృతుని ఇంటికి వెళ్లి రవి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతున్న రేగులగడ్డ దీవెనరాజును పరామర్శించి ఇరువురు కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గేరా పున్నారావు, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, ఎంపీటీసీ కానుగుల పరమేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకుడు నన్నపనేని కిషోర్‌బాబు, వల్లూరి సుధాకర్, పిల్లి మేరి, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు



ప్రత్తిపాడు నూతన హెచ్‌ఎం ఎస్.కె అలీషా



యనమదల నూతన హెచ్‌ఎం రత్తయ్య

ప్రత్తిపాడు: ఉపాధ్యాయుల సాధారణ బదిలీల్లో భాగంగా మండలంలోని మూడు హైస్కూల్స్‌లో ఆదివారం నూతన ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారు. బొల్లాపల్లి మండలం వెల్లటూరు హైస్కూల్ నుంచి బదిలీపై వచ్చిన ఎస్.కె అలీషా ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించారు. సత్తెనపల్లి మండలం కట్టమూరు హైస్కూల్ నుంచి వచ్చిన చెరుకూరి రత్తయ్య యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా.. దొప్పలపూడి నుంచి బదిలీపై వచ్చిన శ్యామ్ సునీత లత గొట్టిపాడు హైస్కూల్ హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టారు. ఆయా పాఠశాలల్లో విద్యాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండాలి

ప్రత్తిపాడు: రౌడీ షీటర్లు వివాదాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో నడుచుకోవాలని ప్రత్తిపాడు ఎస్ఐ కె.నాగేంద్ర అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు ఎక్కడా ఎలాంటి వివాదాలు, తగాదాలు, కొట్లాటల్లో ఉండకూడదని.. అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనడం చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రతివారం కచ్చితంగా పోలీస్‌స్టేషనుకు హాజరు కావాలని ఆదేశించారు. మీ ప్రవర్తన వల్ల మీ పిల్లలు, కుటుంబ సభ్యులపై ఆ ప్రభావం పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జొమోటో కార్మికుల సమస్యలు పరిష్కరించండి

లక్ష్మీపురం: జొమోటో కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుండా యాజమాన్య ప్రతినిధులు కాలయాపన చేస్తూ సమస్యను జఠిలం చేస్తున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుస్తామని గిగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) గౌరవాధ్యక్షులు బి.ముత్యాలరావు హెచ్చరించారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ముత్యాలరావు విలేకరులతో మాట్లాడారు. జొమాటో కార్మికులు ఎదుర్కొన్న సమస్యలు పరిష్కారించాలని మే 29వ తేదీ నుంచి నిరసన తెలియజేస్తున్నారని అన్నారు. కార్మిక శాఖ అధికారి యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని చెప్పినప్పటికీ యాజమాన్య ప్రతినిధులు కాలయాపన చేస్తున్నారని అన్నారు. సమస్య పరిష్కారం చేయకపోతే జూన్ 2వ తేదీ నుంచి గుంటూరు నగరం మొత్తం జొమోటో కార్మికులు అందరూ విధులు నిలుపుదల చేస్తారని, తర్వాత జరిగే పరిణామాలకు యాజమాన్యం ప్రతినిధులే బాధ్యత వహించాలని అన్నారు. సమావేశంలో జమోటో ప్రతినిధులు సోగా బ్రహ్మయ్య, క్రాంతి రణదేవ్, మోహన్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్

నెహ్రూ నగర్: డయల్ యువర్ కమిషనర్ (0863-2224202) కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ తెలిపారు.

చౌక దుకాణాల్లో మళ్లీ పాత రోజులు

- సర్వర్ స్లో అవ్వడంతో రేషన్ కోసం ఎదురుచూపులు
- వృద్ధులు, మహిళలు గంటల తరబడి నిరీక్షణ
- ఈపోస్ మిషన్లతో డీలర్ల కుస్తీలు



ఈమె పేరు జి.మహబూబి. వయస్సు 80 ఏళ్లు. కర్ర లేనిదే కాలు కూడా ముందుకు మోపలేని ఈ వృద్ధురాలిది ప్రత్తిపాడు మండలం గనికపూడి గ్రామం. రేషన్ తీసుకుందామని పొద్దున్నే తమ గ్రామంలోని మసీదు పక్కన ఉన్న చౌక ధరల దుకాణం వద్దకు వెళ్లింది. ప్రతి నెలా పడే వేలిముద్రలు రేషన్ తీసుకునేందుకు ఈనెల పడలేదు. ఆ తరువాత సర్వర్ సమస్య వచ్చింది. కొద్ది సేపు అలానే దుకాణంలో వేచి ఉంది. అయినా సర్వర్ రాలేదు. ఆ వృద్ధురాలికి బీపీ, గ్యాస్ సమస్యలున్నాయి. బిళ్లలేసుకుని అన్నం తినాల్సిన సమయాన్ని రేషన్ దుకాణం వద్దే గడిపింది. ఫలితంగా రేషన్ ఇవ్వడంలో ఆలస్యమంటే చేసేదేమీ లేక వాళ్ల దయ మన ప్రాప్తం.. అంటూ కాళ్లకు పని చెప్పి ఇంటికి వెళ్లి పోయింది. ఆదివారం ఇలా రేషన్ తీసుకోకుండానే నిరాశతో వెనుదిరిగిన కార్డుదారులు ఎందరో.

ప్రత్తిపాడు: చౌక ధరల దుకాణాల వద్ద రేషన్ పంపిణీ కార్యక్రమం తొలి రోజే తుస్సుమన్నది. ఇంటి వద్దనే బియ్యం ఇచ్చే ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసి, ఈనెల 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల వద్ద బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఎంతో ఆర్భాటంగా మొదలు పెట్టిన ఈ కార్యక్రమంపై మొదటి రోజే సర్వర్ చన్నీళ్లు చల్లింది. ఫలితంగా అటు లబ్ధిదారులు, ఇటు రేషన్ డీలర్లు నానా అవస్థలు పడాల్సి వచ్చింది.

ఆదిలోనే సమస్యలు..

ఉదయం 8 గంటల నుంచి గ్రామాల్లోని రేషన్ దుకాణాల వద్ద రేషన్ పంపిణీ కార్యక్రమం మొదలయ్యింది. తొలుత కొద్ది సేపు సర్వర్ బాగున్నప్పటికీ.. ఆ తరువాత ఒక్క సారిగా సర్వర్ డౌన్ అవ్వడంతో కార్డుదారులకు కష్టాలు మొదలయ్యాయి. ప్రత్తిపాడు మండలంలోని గనికపూడి, తుమ్మలపాలెం, నడింపాలెం, ప్రత్తిపాడు గ్రామాల్లో సర్వర్ సమస్యలతో ఒక్కో కార్డుదారునికి బియ్యం ఇచ్చేందుకు సుమారు అర్ధగంట, గంట, గంటన్నరకు పైగా కూడా సమయం పట్టింది. కార్డు నంబర్ నమోదు చేసినా లబ్ధిదారుల పేర్లు కనిపించకపోవడం, లబ్ధిదారుల పేర్లు కనిపిస్తే వేలి ముద్రలు తీసుకోకపోవడం, వేలి ముద్రలు తీసుకుంటే ప్రింట్ ఆప్షన్ రాకపోవడం, తీరా ప్రింట్ ఆప్షన్ వచ్చిన తరువాత మళ్లీ రివర్స్ అయ్యి మొదటికి రావడం వంటి సమస్యలు పదే పదే తలెత్తాయి. దీంతో కార్డుదారులు గంటల తరబడి ఈపోస్ మిషన్లతో కుస్తీలు పట్టాల్సి వచ్చింది.



గనికపూడిలో ఈపోస్ మిషన్‌లో డౌన్ అయిన సర్వర్

వృద్ధులకు ఇక్కట్లు..

రాష్ట్ర ప్రభుత్వం 65 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు తమ ఇంటి వద్దనే రేషన్ అందిస్తామని చెప్పింది. అయినా ఈ విషయమై గ్రామాల్లో వృద్ధులకు, దివ్యాంగులకు సరైన అవగాహన కల్పించడంలో విఫలమవ్వడంతో వృద్ధులు పొద్దున్నే కర్ర చేత పట్టుకుని రేషన్ కార్డులు, సంచులతో రేషన్ దుకాణాల బాట పట్టారు. తీరా అక్కడకు వెళ్లిన తరువాత సర్వర్ డౌన్ అని డీలర్లు చెప్పడంతో దుకాణాల ఎదుట నేలపైన, రోడ్లపైన నిరీక్షించాల్సి వచ్చింది.



నడింపాలెంలో రేషన్ కోసం పడిగాపులు కాస్తున్న మహిళలు

ఇళ్ల స్థలాలు సాధించే వరకు పోరాడుతాం

పెదకాకాని: అర్హులైన పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలాలు కేటాయించి.. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యన్నారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంబంధిత గోడ పత్రికను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి మంత్రి వర్గ సమావేశంలో తీర్మానం చేసి జీవో విడుదల చేశారన్నారు. ఆ జీవో ప్రకారం అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో అర్హులైన అర్జీదారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, గుంటూరు జిల్లా అగ్రిగోల్డ్ బాధితుల సంఘం కార్యదర్శి కేతినేని ఆగస్టీన్, దర్శి లింగారావు, కె.శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, బి.మోజెస్ బాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

పెదకాకాని: ఆయుర్వేద వైద్యం ద్వారా ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణి అన్నారు. మండలంలోని వెనిగండ్ల రామాలయంలో ఆదివారం శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ.. ఆయుర్వేద వైద్యంతో ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవన్నారు. ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్య నిపుణులు, చైర్మన్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆయుర్వేద పంచకర్మ వైద్యం కోసం కేరళ వెళ్లాల్సిన అవసరం లేకుండా అగతవరప్పాడు సమీపంలో అన్ని సౌకర్యాలతో 100 పడకల ఆసుపత్రి స్థాపించామన్నారు. శిబిరంలో 150 మందికి నాడీ పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, కొండమడుగుల సుబ్బారెడ్డి, మున్నంగి సాంబిరెడ్డి, గుడిబండి సాంబిరెడ్డి, వైద్య బృందం డాక్టర్ భాను కశ్యప్, డాక్టర్ మోనిక, డాక్టర్ రాహుల్ చంద్ర, మేనేజర్ మల్లేశ్వరి, థెరఫిస్టులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు

విపత్తు నిర్వహణపై శిక్షణ

గుంటూరు రూరల్: విపత్తు సమయాల్లో ధైర్య సాహసాలతో ప్రజలను రక్షించే విధంగా ఎన్‌సీసీ క్యాడెట్స్ తయారవ్వాలని లెఫ్టినెంట్ కల్నల్ ఎస్ మీఎస్ సుదర్శన్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో పదో ఆంధ్ర బాలికల బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కంబైండ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్-1 శిక్షణ తరగతులు ఆదివారం కొనసాగాయి. కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో విపత్తు నిర్వహణపై ప్రత్యేక శిక్షణను అందించారు. శిక్షణ కార్యక్రమంలో క్యాడెట్స్ విపత్తు నిర్వహణ, భద్రతా చర్యలు, ప్రాథమిక సహాయ చికిత్స, రక్షణ పద్ధతులపై అవగాహన పొందారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ సమాజ సేవలో భాగస్వాములవుతూ తమదంటూ ఒక ప్రత్యేక ముద్రను వేసుకోవాలని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ కె.జగదీష్‌లు తెలిపారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావులు శిక్షణ తరగతులలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ అవినాశిపట్వాల్, క్యాంపు సీనియర్ జేసీఓ ఇమాంసాహెబ్ షేక్, క్యాంపు ట్రైనింగ్ జేసీఓ రాజు, క్యాంపు క్వార్టర్ మాస్టర్ జేసీఓ సూర్యకాంత్, క్యాంపు సూపరింటెండెంట్ కొల్లా రాజశేఖరబాబు, కళాశాల ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ తారాచంద్, డాక్టర్ ఉషా క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్స్

రెడ్డి హాస్టల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నెహ్రూనగర్: ఎస్‌వీఎస్ఆర్ రెడ్డి హాస్టల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం నగరంపాలెంలోని రెడ్డి హాస్టల్ నిర్వహించారు. హాస్టల్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి, అన్నపురెడ్డి పవన్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి 1977 నుంచి 2024 వరకు చదువుకున్న వారంతా హాజరయ్యారు. హాస్టల్ భవనం నిర్మించి 50 సంవత్సరాలై శిథిలావస్థకు చేరుకోవడంతో హాస్టల్ పునఃనిర్మాణానికి రూ.50 లక్షలు విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో సెక్రటరీ కంది సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులు పడాల సుబ్బారెడ్డి, సూరసాని వెంకటరెడ్డి, జాయింట్ సెక్రటరీ భవనం వెంకటరెడ్డి, కోశాధికారి వనుకూరి సాంబిరెడ్డి, రెడ్డి జన సేవా సమితి అధ్యక్షులు వీసీఆర్ రెడ్డి, ఉపాధ్యక్షులు లేళ్ల పెద్ద అప్పిరెడ్డి, శ్యామల కోటిరెడ్డి, ట్రెజరర్ జంగా సీతారామిరెడ్డి, సోమసాని బ్రహ్మానందరెడ్డి, వనుకూరి సాంబిరెడ్డి, ఎం భాస్కర్‌రెడ్డి, జీ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెదకాకాని: గడ్డిపాడు 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఎం.రవికుమార్ తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు. ఈ ఫీడర్ పరిధిలోని గడ్డిపాడు, గణేష్‌నగర్, ఎఎస్ కన్వెన్షన్, గాయత్రీనగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీహెచ్ ఖాన్, ఏఈ రవికుమార్‌లు ఆదివారం ఒక ప్రకటన ద్వారా కోరారు.

వెన్నుపోటు దినంపై దిశానిర్దేశం నేడు

గుంటూరు రూరల్: ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈనెల 4వ తేదీన జరిగే వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమంపై దిశానిర్దేశం ఉంటుందని నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమంలో పార్టీ గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు పోతిన మహేష్, జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు పాల్గొని కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేస్తారన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి వివిధ హోదాల్లో ఉన్న నాయకులు తప్పక హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

యువ రైతులు ముందుకు రావాలి



చేబ్రోలు: వ్యవసాయ యాంత్రీకరణ, నూతన సాంకేతికత అందిపుచ్చుకునేందుకు యువ రైతులు ముందుకురావాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పిలుపునిచ్చారు. చేబ్రోలు మండలంలోని శేకూరు గ్రామానికి చెందిన శ్రీ స్కంద కిసాన్ డ్రోన్ సీహెచ్‌సీ సభ్యులకు కిసాన్ డ్రోన్ మంజూరు అయ్యింది. ఈ డ్రోన్‌ను ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డ్రోన్ టెక్నాలజీతో రైతులకు అండగా నిలవాలని.. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఊబిలో చిక్కుకుపోయిన గేదెలు



ప్రత్తిపాడు: ఎర్రక్కపోయి బురద ఊబిలో చిక్కుకుని గేదెలు మూగ రోదన అనుభవించాయి. రాత్రంతా అంబా.. అంబా.. అని అరిచిన అరుపులు అరణ్యారోదనగా మిగిలాయి. వివరాల్లోనికి వెళితే.. గ్రామంలోని పొలాల్లో మేత మేసేందుకు వచ్చిన 5 గేదెలు మేత మేస్తూ శనివారం సాయంత్రం సమయంలో జల్లవాగులోకి దిగాయి. దాహం తీర్చుకునేందుకు నీటి కోసమో లేక మరేదైనా కారణమో తెలియదు గానీ గేదెలన్నీ బురద గుంటలోనికి దిగి సగానికిపైగా కూరుకుపోయాయి. ఊబి బాగా లోతుగా ఉండటంతో బయటకు రాలేక మూగ జీవాలు రాత్రంతా నరకయాతన అనుభవించాయి. పెద్ద పెద్దగా గేదెలు అరుస్తున్నప్పటికీ రాత్రి సమయం కావడంతో ఎవ్వరూ ఏమీ చేయలేని పరిస్థితి చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం గేదెల బాధను గమనించిన స్థానికులు దాదాపుగా రెండు గంటల పాటు నానాయాతన పడి శ్రమించి బయటకు లాగారు. కాగా ఆ గేదెలు ఎవరివనేది తెలియరాలేదు.

'వెన్నుపోటు దినం' జయప్రదం చేయాలి

ప్రత్తిపాడు: సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడుస్తుందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చల్లా హనుమంత్ యాదవ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని వైఎస్సార్ కాంస్య విగ్రహం ఎదుట ఆదివారం 'వెన్నుపోటు దినం' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 4వ తేదీన జరగనున్న వెన్నుపోటు దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక రకాల హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం, ఏడాది గడుస్తున్నా హామీలను అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేస్తుందన్నారు. అందుకు ప్రజాగళాన్ని ప్రభుత్వానికి వినిపించేందుకు ప్రతి కార్యకర్త వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొనాలని హనుమంత్‌యాదవ్ పిలుపునిచ్చారు. అనంతరం ఆయన నాయకులతో కలిసి ప్రత్తిపాడు ఎస్ఐ కె.నాగేంద్రకు కార్యక్రమానికి అనుమతులు కోరుతూ వినతిపత్రం అందించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కాకుమాను: వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని.. అది ఆయన నైజమని వైఎస్సార్‌సీపీ పెదనందిపాడు మండల కన్వీనర్ ఖాసీం పీరా అన్నారు. పెదనందిపాడు పార్టీ కార్యాలయంలో ఆదివారం వెన్నుపోటు దినం పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఖాసీం పీరా మాట్లాడుతూ.. బాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాష్ట్ర ప్రజలందరికీ వెన్నుపోటు పొడిచారని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ తగిన బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు. ఈనెల 4వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హనుమంత్ యాదవ్, పార్టీ నాయకులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఖాసీం పీరా

విద్యతోనే సమాజంలో గౌరవం

పెదకాకాని: క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడంతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని సుందరయ్యకాలనీలో ఆదివారం పీహెచ్‌డీ పట్టా పొందిన కుక్కల ప్రభుచంద్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శివాజీ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో జన్మించిన ప్రభుచంద్ పెదకాకానిలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారని గుర్తుచేశారు. నేడు ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పోస్టు గ్రాడ్యుయేట్ పట్టా పొందడం అభినందనీయమన్నారు. తాను చదువుకున్న విద్య ద్వారా సాటి వారికి మేలు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రభుచంద్ అన్నారు. అనంతరం సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుచంద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కోటిపల్లి సత్యన్నారాయణ, ఉల్లంగుల శివయ్య, బురదగుంట సాంబయ్య, బాబూరావు, సుందరయ్యకాలనీ వాసులు పాల్గొన్నారు.



ప్రభుచంద్‌ను అభినందిస్తున్న జిల్లా సీఐటీయూ కార్యదర్శి శివాజీ

• అందుబాటులో లేని వైద్యాధికారులు!

గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు అందుబాటులో ఉండడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదివారంతో పాటు సెలవు దినాల్లో వైద్యులు స్థానిక ఆసుపత్రిలో ఉండని పరిస్థితి చోటు చేసుకుంది. సెలవు దినాల్లోనూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు వైద్యాధికారులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాల్సి ఉంది. కానీ ఇక్కడ మాత్రం అది మినహాయింపు. సెలవు రోజుల్లో ఒకే ఒక్క స్టాఫ్ నర్సు అందుబాటులో ఉంటున్నారు. వాళ్లు కూడా సాయంత్రం 4 గంటల వరకే ఉండి ఆసుపత్రికి తాళాలు వేసి వెళ్లిపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వైద్యాధికారులు ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

– ప్రత్తిపాడు



ఖాళీగా ఉన్న వైద్యులగది-1

బీపీ మండల్ ట్రస్ట్ ఆవిష్కరణ

నెహ్రూనగర్: బీసీల అభ్యున్నతికి సరైన వేదిక ఉండాలనే ఉద్దేశంతో బీపీ మండల్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని బీపీ మండల సేన రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం నల్లచెరువులోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాజీ మంత్రి రఘువీరారెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ శ్యాంప్రసాద్, ఏపీ టీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణలతో కలసి బీపీ మండల్ ట్రస్ట్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా బీపీ మండల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి రాజధాని ప్రాంతంలో 40 సెంట్ల భూమిని ట్రస్ట్‌కు విరాళంగా ఇస్తామని ప్రకటించిన ఆలా వెంకటేశ్వర్లును ప్రత్యేకంగా అభినందించారు.

స్కాలర్‌షిప్‌లు పంపిణీ

అనంతరం శ్రీ కృష్ణ యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో 500 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. యాదవ విద్యార్థుల కెరీర్ గైడెన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ సీఈఓ బి.జ్యోతిబసు మాట్లాడుతూ విద్యార్థులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు.



బీపీ మండల్ ట్రస్ట్ లోగోను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి, రామకృష్ణ తదితరులు

సంప్రదాయ కళల్లో ఉచిత శిక్షణ అభినందనీయం

నగరంపాలెం: సంప్రదాయ కళల్లో నెలరోజులు ఉచిత శిక్షణ అందించడం అభినందనీయమని ప్రముఖ నాట్యాచారులు కాజా సుబ్రహ్మణ్యం అన్నారు. సంపత్‌నగర్ శ్రీరామనామక్షేత్రంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు సభ ఆదివారం నిర్వహించారు. సద్గురు కళానిలయం నిర్వహణలో జరగగా.. నంది అవార్డు గ్రహీత బసవరాజు జయశంకర్ సభాధ్యక్షత వహించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీమాన్ రాఘవాచారి వేదస్వస్తి ప్రార్థనతో ప్రారంభించారు. అనంతరం కాజా సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించారు. ఎస్‌వీ రమణరవిబాబు, నడింపల్లి హనుమంతరావు, శిక్షణాచార్యులు బసవరాజు జయశంకర్, పీవీ లక్ష్మీతేజస్వి, వైఆర్ సుబ్రహ్మణ్యం, కిన్నెర, బి.రామకృష్ణారావు, పి.హేమలతనారాయణ పాల్గొన్నారు.